క్లుప్తంగా

మహాసభలను విజయవంతం చేయాలి



బోధన్: ఖమ్మం జిల్లా కేంద్రంలో మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న విప్లవ కమ్యూనిస్టు పార్టీల ఐక్యత జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్ కోరారు. సాలూర మండలంలోని ఖాజాపూర్‌లో బుధవారం నిర్వహించిన పార్టీ, ప్రజాసంఘాల సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలమైన విప్లవ కమ్యూనిస్టు నిర్మాణానికి ఐక్యత జాతీయ మహాసభలు ఒక ముందడుగని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల ప్రతినిధులు పడాల శంకర్, నాయకులు పాల్గొన్నారు.

రూ. 30 వేల జరిమానా

నవీపేట : మండల కేంద్రం శివారు నుంచి మొరం అక్రమంగా రవాణా చేస్తున్న జేసీబీ, టిప్పర్‌ను సీజ్ చేసి రూ.30 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ ధన్వాల్ బుధవారం తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఎలాంటి అనుమతి లేకుండా నవీపేట శివారులోని లింగం గుట్ట సమీపంలో జేసీబీ, టిప్పర్‌తో మొరం అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు సీజ్ చేశారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండింటికి రూ.30 వేల జరిమానా విధించామన్నారు. మొరం అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



బోధన్‌రూరల్(బోధన్): పట్టణంలోని శ్రీచక్రేశ్వర ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారులు, పోలీసుశాఖ, ఆలయ కమిటీ సమక్షంలో బుధవారం లెక్కించారు. గత మూడు నెలల కాలంలో రూ.1,35,265 నగదు ఆదాయం సమకూరినట్లు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కమల తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ బుజ్జి, ఈవో రవీందర్, పోలీసులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్‌లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. గ్రామంలో అక్రమ కనెక్షన్ల ద్వారా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారనే సమాచారం మేరకు ఆకస్మిక దాడులు చేశారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఇద్దరి ఇళ్లకు కనెక్షన్ కట్ చేశారు.

సీఈఐఆర్ ద్వారా ఐదు ఫోన్‌ల రికవరీ



భీమ్‌గల్: చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా గుర్తించిన పోలీసులు వాటిని రికవరీ చేసి బాధితులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై హరిబాబు మాట్లాడుతూ.. కొన్ని రోజుల క్రితం తమ ఫోన్‌లు పోయాయని బాధితులు ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ ద్వారా రికవరీ చేశామన్నారు. సెల్‌ఫోన్లు చోరీకి గురైనా, పోగొట్టుకున్నా వెంటనే ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 19 మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఐదో తరగతి నుంచి 8వ తరగతి వరకు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 18నుంచి ఫిబ్రవరి ఆరో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. బడుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 24 నుంచి 30 వరకు అభ్యర్థుల ఎంపిక, సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మే 1నుంచి 10వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 94931 15986, 98494 19469 నంబర్లను సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు బుధవారం సంబురాలు నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ పదవిని కేటాయించింది. దీంతో పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. బాడ్సి శేఖర్‌గౌడ్, ముప్ప గంగారెడ్డి, దయాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టలను కరిగించారు

- మొరం మాఫియాతో చేతులు కలిపిన అధికారులు!
- బాల్కొండలో గుట్టలు గుల్ల
- వరద కాలువ నుంచి మొరం ఖాళీ



సమీకృత హాస్టల్ భవనం వెనుక ఉన్న గుట్ట..



బాల్కొండ కేజీబీవీ ఎదుట ఉన్న గుట్టను తవ్వేసిన దృశ్యం

బాల్కొండ: యథేచ్ఛగా మొరం తవ్వుతూ మండల కేంద్రంలోని గుట్టలను కరిగించేశారు. కొందరు మొరం మాఫియాతో అధికారులు చేతులు కలిపి గుట్టలను కొల్లగొట్టారు. కొంతకాలం క్రితం డిప్యూటీ తహసీల్దార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగారు. పూర్తిస్థాయి తహసీల్దార్ లేకపోవడంతో గుట్టల్లో మొరం తవ్వకాలు జోరందుకున్నాయి. దీంతో బాల్కొండ మండల కేంద్రంలోని కేజీబీవీ ఎదుట, సమీకృత హాస్టల్ భవనం ఉన్న గుట్టలతోపాటు ఎన్టీఆర్ కాలనీ వైపు ఉన్న గుట్ట, మోడల్ పాఠశాల వెనుక ఉన్న గుట్ట మొరం తవ్వకాలతో ఖాళీ అయ్యాయి.

అనుమతుల పేరుతో మొరం అక్రమ రవాణా అడ్డగోలుగా సాగింది. అనుమతించిన దానికంటే భారీ స్థాయిలో మొరం తరలించేందుకు అధికారులే బాటలు వేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మొరం వ్యాపారుల దందా మూడు టిప్పర్లు.. ఆరు ట్రాక్టర్లుగా సాగింది.

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసమంటూ..

గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రానికి ఫైర్ స్టేషన్ మంజూరైంది. ఫైర్ స్టేషన్ నిర్మాణానికి స్థలం లేకపోవడంతో కొండలను తవ్వి స్థలాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చారంటూ తవ్వకాలు షురూ చేశారు. కానీ ఫైర్ స్టేషన్ నిర్మాణం కోసం సర్వే నంబరు 1333లో రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించారు. సర్వే నంబరు 1333లో స్థలం కేటాయింపు జిల్లా కలెక్టర్ ఆదేశాలంటూ రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు. గుట్టలు తవ్వి స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ ఆదేశాలని చెప్పిన అధికారులు, మళ్లీ వేరే చోట స్థలం కేటాయింపు కూడా కలెక్టర్ ఆదేశాలంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన సీనరేజీను కూడా పూర్తిస్థాయిలో చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్ని క్యూబిక్ మీటర్ల మొరం తవ్వారు, ప్రభుత్వానికి ఎంత సీనరేజీను జమ చేశారనేదానిపై విచారించాలని స్థానికులు కోరుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే వరద కాలువ మొరాన్ని మాఫియా ఖాళీ చేసింది. ప్రధానంగా వరద కాలువ జీరో పాయింట్ వద్ద తవ్వకాల్లో ఎక్కువ మొత్తంలో మొరం వెళ్లింది. ఆ మొరాన్ని అనుమతులు లేకుండానే ఖాళీ చేశారు. ప్రాజెక్ట్ , రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా మొరం మాఫియ దందాను జోరుగా సాగించింది. ఉన్నతాధికారులు స్పందించి మొరం తవ్వకాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. మొరం తవ్వకాలపై అధికారులు స్పందించక పోవడం గమనార్హం.



వరద కాలువ జీరోపాయింట్ వద్ద..

అభివృద్ధి ప్రణాళిక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ సాయిరెడ్డి

వర్ని (చందూర్) : 2024– 25 ఆర్థిక సంవత్సరానికి చందూర్ గ్రామంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సమావేశాన్ని సర్పంచ్ కర్లం సాయిరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలైన మురికి కాలువలను శుభ్రం చేయడం, తాగునీటి సౌకర్యాన్ని మెరుగుపరచడం తదితర పనులను చేపట్టాలని ప్రణాళిక సమావేశంలో నిర్ణయించారు. ఎంపీపీ లావణ్యరామ్‌రెడ్డి, ఎంపీడీవో నీలావతి, ఎంపీవో తారాచంద్, సొసైటీ చైర్మన్ అశోక్, ఉపసర్పంచ్ శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

ఆర్మూర్: ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓటమిని జీర్ణించుకోలేని జీవన్‌రెడ్డి.. తన రాజకీయ స్వార్థం కోసం వ్యక్తిగత దూషణలకు దిగడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని హితవు పలికారు.

సొసైటీ చైర్మన్ ఎన్నిక జరిగేనా?

- చివరి క్షణంలో వాయిదాపడిన ప్రక్రియ
- తమ పార్టీకే పదవి దక్కాలంటున్న కాంగ్రెస్



మాక్లూర్: జిల్లాలోనే పెద్ద సొసైటీగా గుర్తింపు ఉన్న మాక్లూర్ వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ రోజుకో మలుపు తిరుగుతున్నది. ఈ నెల 17న ఎన్నిక ప్రక్రియ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. వాయిదా పడడంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. పదవిని ఆశిస్తున్న వారు ఇంకా ఎంత కాలం ఖర్చులు భరించాలని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఎన్నిక ఉంటుందని ఆశించి డైరెక్టర్లను వెంటబెట్టుకొని క్యాంపులో ఉన్న వారికి ఎన్నిక ప్రక్రియ వాయిదా పడినట్లు మంగళవారం రాత్రి తెలిసింది. 13 మంది డైరెక్టర్లు, 4,200 మంది రైతుల సభ్యత్వం ఉన్న సొసైటీకి అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా గుర్తింపు ఉన్న గోపు రంజిత్ తల్లి గోపు లక్ష్మి చైర్‌పర్సన్‌గా ఎన్నికైంది. అయితే చైర్మన్ పదవిని మరో ముఖ్య నాయకుడు, ముల్లంగి(బి) డైరెక్టర్ బూరోళ్ల అశోక్ సైతం ఆశించగా, చెరో రెండున్నరేళ్లపాటు చైర్మన్ పదవిలో కొనసాగాలని ఒప్పందాన్ని కుదిర్చి లక్ష్మికి మొదట అవకాశం ఇచ్చారు.

తల్లి పేరుతో తనయుడి హవా

సొసైటీ చైర్‌పర్సన్‌గా గోపు లక్ష్మి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే ఆమె కుమారుడు గోపు రంజిత్ ఇష్టారాజ్యంగా వ్యవహరించినా ఒక్క డైరెక్టర్ కూడా పెదవి విప్పకపోగా, సొసైటీ కార్యదర్శి విష్ణువర్ధన్ సైతం కొన్నాళ్లపాటు చూసీచూడనట్లు వ్యవహరించారని పలువురు విమర్శిస్తున్నారు. రంజిత్ అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు కావడమే దీనికంతటికి కారణమని తెలుస్తోంది. చైర్మన్ కుర్చీలో సైతం అతడే కూర్చుని అంతా తానే అన్నట్లు వ్యవహరించాడు. రంజిత్ ఆగడాలు ఎక్కువై సొసైటీ బ్యాంకు నుంచి రూ.2లక్షలు, రూ.5లక్షలు కావాలంటూ రోజూ వేధించడం, తప్పుడు లెక్కలు రాయాలని ఒత్తిడి తీసుకురావడంతో కార్యదర్శి విష్ణువర్ధన్‌పై ఒత్తిడి తీసుకురావడంతో ఇద్దరి మధ్య వార్ మొదలైంది. పంచాయితీని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లిన రంజిత్.. విష్ణువర్ధన్‌ను ఇక్కడి నుంచి పంపించేశాడు. తన నచ్చిన వ్యక్తిని కార్యదర్శిగా తీసుకువచ్చి అవకతవకలకు తెరలేపాడు. నాలుగేళ్ల పదవీకాలంలో తప్పుడు లెక్కలు చూపి ఏడాదికి రూ.60లక్షల నుంచి రూ.70లక్షలు కాజేశాడనే ఆరోపణలు ఉన్నాయి.

అశోక్ ఆశలు ఆవిరి

చైర్మన్ ఎన్నిక సమయంలో గోపు లక్ష్మి, బూరోళ్ల అశోక్ చెరో రెండేన్నరేళ్లపాటు పదవిలో కొనసాగాలని అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఎదుట రాసిన ఒప్పందం బుట్టదాఖలైంది. రెండున్నరేళ్ల తరువాత అశోక్ తన పదవి విషయమై జీవన్‌రెడ్డి వద్దకు వెళ్లగా ఖాతరు చేయలేదు. దీంతో చైర్మన్ పదవిపై అశోక్ పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. రంజిత్ తన ప్రధాన అనుచరుడు కావడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అయితే అశోక్ సైతం మొదటి నుంచి జీవన్‌రెడ్డి అంటే ప్రాణం ఇచ్చే వ్యక్తిగా ఉంటూ తాను నమ్ముకున్న వ్యక్తి, రాజకీయాల కోసం వ్యవసాయ భూములను విక్రయించుకుని ఒట్టి చేతులతో మిగిలాడు.

జీవన్‌రెడ్డి రూపంలో మరోసారి అడ్డంకి

ఒప్పందం ప్రకారం పదవి రాకపోవడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో బూరోళ్ల అశోక్ సొసైటీ డైరెక్టర్లతో తనకున్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించుకుని అవిశ్వాసం పెట్టించి చైర్మన్ అవుదామనుకున్నాడు. అందుకు డైరెక్టర్లు కూడా మద్దతు తెలిపారు. ఈ విషయం జీవన్‌రెడ్డి వద్దకు వెళ్లడంతో చివరకు అశోక్‌ను చైర్మన్ కుర్చీలో కూర్చోపెట్టాలని నిర్ణయించాడు. అక్కడే గోపు లక్ష్మితో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు లేఖ రాయించి అధికారులకు ఇప్పించాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఆ పార్టీకి చెందిన డైరెక్టర్ దయాకర్‌రావు కూడా అందుకు అంగీకరించలేదు. తమ ప్రభుత్వం ఉండగా.. ఓటమిపాలైన జీవన్‌రెడ్డి వద్దకు వెళ్లి ఎలా నిర్ణయం తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హుటాహుటిన హైదరాబాద్‌కు వెళ్లి ఈనెల 17న జరగాల్సిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయించారు. ఈ విధంలో జీవన్‌రెడ్డి రూపంలో బూరోళ్ల అశోక్‌కు మరోసారి అడ్డంకి ఎదురైంది. అశోక్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరితేనే చైర్మన్ పదవి దక్కడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలపై యువత ఆసక్తి చూపాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎక్సైజ్ ఎస్సై మల్లేశ్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): యువత క్రీడాపోటీలపై ఆసక్తి చూపాలని, ఆటల పోటీలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని ఎక్సైజ్ ఎస్సై మల్లేష్ పేర్కొన్నారు. మండలంలోని మంచిప్పలో బుధవారం జై భారత్ యూత్ అధ్యక్షుడు నాయుడు సాయిరాం ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. యువత మత్తు, మాదకద్రవ్యాలకు బానిసలై తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. స్వామి వివేకానంద సూచించిన బాటలో నడుస్తూ వారిచ్చిన ప్రసంగాలు, సూక్తులను మననం చేసుకుంటూ తమ భవిష్యత్‌ను సక్రమంగా మల్చుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో గంజాయి, మత్తుపదార్థాలు విక్రయిస్తే తమకు సమాచారమందించాలని కోరారు. 20ఏళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జై భారత్ యువజన సంఘానికి అభినందనలు తెలియజేశారు. సర్పంచ్ సిద్ధార్థ, మాజీ ఎంపీటీసీ వెంకట్రాం నాయక్, వీడీసీ అధ్యక్షుడు గోపూరు నరేష్‌రెడ్డి, దేవేందర్, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నాయకుల చేరిక



వర్ని (చందూర్) : మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో వర్ని మాజీ వైస్ ఎంపీపీ రామ్‌రెడ్డి, సహకార సంఘం మాజీ సభ్యులు కనగాల కిశోర్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు నర్సారెడ్డి, నాయకులు సాయిరెడ్డి, అట్నాల గంగాధర్, బొట్టె హన్మాండ్లు, జగ్గారి శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

మైనర్లను పనిలో పెడితే చర్యలు



బడిబయట ఉన్న బాలుడితో అధికారులు

ఆర్మూర్‌టౌన్: మైనర్లను దుకాణాల్లో పనికి చేర్చుకుంటే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని చైల్డ్ వెల్ఫేర్ అధికారి అనిల్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని చైల్డ్ వెల్ఫేర్ అధికారులు 'ఆపరేషన్ స్మైల్' స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బడి మానేసిన చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారి అనిల్ మాట్లాడుతూ.. పిల్లలను కచ్చితంగా పాఠశాలకు పంపించాలన్నారు. పనిలో పెట్టుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై హనుమంతు, షీటీం సభ్యులు సుమతి, విఘ్నేశ్, గంగనర్సయ్య, వినయ్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి ఆడెపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాగులు పోరాటం మరువలేనిది

- బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్‌లో పని చేసిన కామ్రేడ్ బిల్లా బాగులు మినీ సిగరెట్ల ఉద్యమంతోపాటు బీడీ కట్టలపై పుర్రె గుర్తు బొమ్మలకు వ్యతిరేకంగా చేసిన పోరాటం మరువలేనిదని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ అన్నారు. డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడలో బీడీ కార్మికులతో కలిసి బిల్లా బాగులు మూడవ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వనమాల కృష్ణ మాట్లాడుతూ.. నందిపేట్ మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన బిల్లా బాగులు బీడీ వర్కర్‌గా పని చేస్తూ యూనియన్‌లో చేరి క్రియాశీలంగా వ్యవహరించారన్నారు. అనారోగ్యంతో ఆయన మరణించడం తీరని లోటని పేర్కొన్నారు. బీడీ కార్మికులకు పని దినాల పెంపు, పీఎఫ్ అమలు కోసం కృషి చేసినట్లు గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం యూనియన్ పని చేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, సాయిరెడ్డి, సాయినాథ్, చంద్రశేఖర్, పెద్ద భూమేశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ మెడికల్ భవనం నుంచి వృథా నీరు వచ్చి బస్టాండ్ ప్రాంతంలో చేరుతున్నదని, దుర్గంధం వెదజల్లుతున్నదని సీపీఎం పట్టణ అధ్యక్షుడు కుతాడి ఎల్లయ్య అన్నారు. డ్రెయినేజీ నీళ్లు నిలువకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం బస్టాండ్ ప్రాంతంలో ధర్నా నిర్వహించిన అనంతరం ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఆంజనేయులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. బస్టాండ్ చుట్టుపక్కల ఉన్న హోటళ్లలో ప్రజలు టిఫిన్లు చేసి అనారోగ్యానికి గురవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. శ్రీదేవి కాంప్లెక్స్ డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తోగాటి భూమన్న, సిద్దాల నాగరాజు, చెరుకు నారాయణ, ఓంకార్, ఫిరోజ్‌ఖాన్, కిషన్, గంగా నర్సయ్య, వెంకటేశ్, నరేందర్, నదీమ్‌భాయ్, దీపేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ క్యాంపెయినింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కార్యక్రమానికి హాజరైన బీఎల్‌వోలు

కమ్మర్‌పల్లి: ఈనెల 20, 21 తేదీల్లో గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించనున్న ఓటరు స్పెషల్ క్యాంపెయినింగ్‌ను వినియోగించుకోవాలని కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో బుధవారం బూత్‌స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. నిర్దేశిత తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తప్పొప్పుల సవరణ, పేర్ల తొలగింపు కోసం దరఖాస్తులను స్వీకరించాలన్నారు. 18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీటీ భాస్కర్, ఆర్ఐ శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంగి రాములు మహరాజ్‌కు సన్మానం



మహరాజ్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని నంది ఆలయ కమిటీ సభ్యులు కేదారేశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్‌ను బుధవారం సన్మానించారు. చారిత్రక ఆలయమైన నందికేశ్వర ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని, ఏకరాతి స్వయం భూలింగం నందితో కూడిన ఆలయం చాలా పవిత్రమైనదని మహరాజ్ పేర్కొన్నారు. మహోన్నత శక్తులు కలిగిన ఈ ఆలయంలోని శివలింగం 24గంటల నిరంతర రుద్రాభిషేకంతో శక్తివంతమవుతుందని, వేదపండితుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మచ్చర్ల సాగర్, వైస్ చైర్మన్ కిషన్, కోశాధికారి ఎర్రం నడిపి ముత్యం, డైరెక్టర్లు దుబాయ్ శ్రీనివాస్, తాటికాయల సుభాష్, ఎర్రం ప్రవీణ్, ఎర్రం లింగం, ఆర్మూర్ గంగారాం, బుక లింబాద్రి, వాల్గొట్ రాజు, మడబోయి గణేశ్, కుమ్మరి శ్రీకాంత్, సుంకరి సుమన్, దవత్ లింగం, చెలిమెల విఠల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన నాయకులు



ఆర్మూర్‌టౌన్: జిల్లాలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు నాయకులు బుధవారం ఘనస్వాగతం పలికారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం వద్ద మంత్రికి మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న స్వాగతం పలికారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – సైంధవ్ (తెలుగు)- 10.00, 1.00, 7.05, 10.05 మేరి క్రిస్మస్ (తెలుగు) 4.00

స్క్రీన్-2 – గుంటూరు కారం (తెలుగు)- 9.00, 12.20, 3.40, 7.00, 10.20

స్క్రీన్-3 – హనుమాన్ (తెలుగు)- 09.10, 12.30, 3.50, 7.25, నా సామిరంగ (తెలుగు) 10.45

స్క్రీన్-4 – నా సామిరంగ (తెలుగు)- 10.20, 1.30, 4.40, 7.50 హనుమాన్ (తెలుగు) - 11.00